# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 20 సంచిక : 234 | శనివారం 25, ఏప్రిల్ 2026 | పేజీలు: 04 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com


## ప్రభుత్వంతో ఆర్టీసీ
# చర్చలు సఫలం

### విలీనంపై మంత్రుల బృందం గ్రీన్ సిగ్నల్


- మూడు ప్రధాన డిమాండ్లకు సర్కార్ ఆమోదం
- ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు కార్యాచరణ
- కార్మిక సంఘాల ఎన్నికల నిర్వహణకు పచ్చజెండా
- 2021, 2025 పీఆర్సీ బకాయిలు, ఫిట్‌మెంట్ చెల్లింపు
- ప్రైవేటు, ఎలక్ట్రిక్ బస్సులు వచ్చినా ఉద్యోగ భద్రత
- సమ్మె రెండో రోజే చర్చలకు పిలిచిన సీఎం చొరవపై ప్రశంసలు
- మహాలక్ష్మి పథకం నష్టాలను భరిస్తూ ఆదుకోవడంపై చర్చ
- ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాల చెల్లింపుపై హర్షం
- దశాబ్దాల పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) కార్మిక సంఘాల జేఏసీ ప్రతినిధులతో ప్రభుత్వ కమిటీ జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. సమ్మెకు దారితీసిన మూడు ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకోవడంతో వివాదం కొలిక్కి వచ్చింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలోని మంత్రుల బృందం కార్మిక నేతలతో సుదీర్ఘంగా చర్చలు జరిపింది. ఈ సమావేశంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను ఒక నిర్దిష్ట కాలపరిమితిలోగా పూర్తి చేసేందుకు ..మిగతా 2లో




## ఆర్టీసీ డ్రైవర్
# శంకర్‌గౌడ్ మృతి



- హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత
- డిపో వద్ద నిప్పంటించుకున్న ఉదంతంతో అట్టుడికిన నర్సంపేట
- బహిరంగ సభలు, ఆందోళనలతో హోరెత్తించిన ఆర్టీసీ కార్మికులు
- క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించిన కలెక్టర్, సీపీ, ఉన్నతాధికారులు
- మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే దొంతిరెడ్డి రూ. 5 లక్షల ఆర్థిక సాయం
- ముత్తోజీపేటలో పోలీసుల ఆంక్షలు.. రాజకీయ నేతల మధ్య వాగ్వాదం
- పది లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం ప్రకటించిన ప్రభుత్వం


**నర్సంపేట, (ప్రజాస్వరం):**

వరంగల్ జిల్లా నర్సంపేట డిపోలో ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ కోల శంకర్‌గౌడ్ చికిత్స పొందుతూ మరణించారు. గురువారం నర్సంపేట బస్టాండ్‌లో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న ఆయన పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ కంచన్‌బాగ్‌లోని డీఆర్డీవో అపోలో ఆసుపత్రికి తరలించారు. సుమారు 85 నుంచి 95 శాతం మేర కాలిన గాయాలతో ఉన్న శంకర్‌గౌడ్‌కు వైద్యులు వెంటిలేటర్‌పై అత్యవసర చికిత్స అందించారు. రక్తపోటు పడిపోవడం, గొంతులో వాపు పెరగడంతో శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారి ప్రాణాలు విడిచారు. ఈ వార్త తెలియగానే నర్సంపేట డిపో పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తోటి ఉద్యోగులు, కార్మికులు భారీ ఎత్తున నిరసనలకు దిగారు. కార్మికుల సమస్యలు పట్టించుకోకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం వల్లే శంకర్‌గౌడ్ ..మిగతా 2లో

---

## వాహనదారుల తప్పిదాలతోనే
# ప్రమాదాలు

- రోడ్డు ప్రమాదాలపై డీజీపీ శివధర్ రెడ్డి ఆందోళన
- ప్రమాదాల కారణంగా రోజుకు 20 కుటుంబాల్లో విషాదం
- ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనే ఘటనలకు ప్రధాన కారణం
- హెల్మెట్, సీట్ బెల్ట్ ధరిస్తే ప్రాణాపాయం తప్పే అవకాశం
- రహదారులపైసైన్‌బోర్డులకొరతను గుర్తించిపోలీసులచర్యలు
- ఫీడర్ రోడ్ల నుంచి ప్రధాన రహదారులకు వచ్చే చోట అప్రమత్తత
- 'ఎరైవ్-ఎలైవ్' కార్యక్రమం ద్వారా 16 శాతం తగ్గిన ప్రమాద మరణాలు
- ట్రాఫిక్ చలానాలపై డిస్కౌంట్లు, రాయితీలు ఉండవని వెల్లడి
- కఠిన నిర్ణయాల ద్వారానే ప్రమాదాలను ఆపగలమని స్పష్టం




# కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులకు ఊరట

- 15 ఏళ్ల నాటి 'మిలియన్ మార్చ్' కేసు కొట్టివేసిన హైకోర్టు
- తెలంగాణ ఉద్యమ కాలం నాటి పాత కేసుల నుంచి విముక్తి
- 2011 ట్యాంక్‌బండ్ మిలియన్ మార్చ్ ఘటనపై కీలక తీర్పు
- రాజకీయ కారణాలతో కూడిన కేసులను కొనసాగించాల్సిన పని లేదు
- ఉమ్మడి పాలనలో నమోదైన ఆరోపణలను కొట్టివేసిన న్యాయస్థానం
- ఉద్యమ నేతలపై ఆంక్షల ధిక్కరణ కేసులకు తెర
- శాంతి భద్రతల విఘాతం ఆరోపణల్లో వాస్తవం లేదని వెల్లడి
- హైకోర్టు నిర్ణయం పట్ల బీఆర్ఎస్ శ్రేణుల హర్షా తిరేకాలు
- రాష్ట్ర సాధన పోరాటంలో అక్రమ కేసులు పెట్టారని నేతల వాదన




**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహా పార్టీ కీలక నేతలు కేటీఆర్, హరీశ్ రావులకు తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట లభించింది. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఒక పాత కేసును న్యాయస్థానం శుక్రవారం కొట్టివేస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. తెలంగాణ మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న సమయంలో దాదాపు 15 ఏళ్ల క్రితం ఈ కేసులు నమోదయ్యాయి. 2011 మార్చి 10వ తేదీన హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన 'మిలియన్ మార్చ్' సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాల ఆధారంగా అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ చట్టపరమైన చర్యలు చేపట్టింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిర్వహించిన ఆందోళనలో ఆంక్షలు ఉల్లంఘించారని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించారనే నెపంతో పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసులపై సుదీర్ఘ కాలం పాటు విచారణ కొనసాగినప్పటికీ, చివరకు రాజకీయ ప్రేరేపిత ..మిగతా 2లో

## కమలం గూటికి
# మల్లారెడ్డి కుటుంబం?

- బీజేపీ ఆఫీస్‌కు మల్లారెడ్డి కోడలు.. రాజకీయాల్లో హాట్ టాపిక్!!
- గత కొన్ని రోజులుగా బీజేపీ చేరికపై వార్తలు
- కార్యాలయ సందర్శనతో ఊహాగానాలకు బలం
- త్వరలో అధికారిక నిర్ణయం ఉండొచ్చని రాజకీయ వర్గాల అంచనా
- మల్లారెడ్డి గ్రూప్ యూనివర్సిటీస్ AI క్యాంపస్ ప్రారంభోత్సవానికి ఆహ్వానం




**మేడ్చల్ , (ప్రజాస్వరం):**

మేడ్చల్ రాజకీయాల్లో బలమైన పట్టున్న మల్లారెడ్డి కుటుంబం త్వరలో 'కాషాయ' కండువా కప్పుకోబోతుందా? అనే సందేహాలకు బలం చేకూర్చేలా తాజాగా ఒక కీలక పరిణామం చోటు చేసుకుంది. మాజీ మంత్రి మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి ఇవాళ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లారు. ఈ మేరకు ఆమె బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. వచ్చే నెలలో తమ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ..మిగతా 2లో

# శంకర్ గౌడ్‌ది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే

- సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలన్న డిమాండ్
- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పరిస్థితి తీవ్రత
- ఎన్నికల హామీల అమలుపై ప్రశ్నలు
- మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర ఆవేదన



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

ఆర్టీసీ కార్మిక సోదరుడు శంకర్ గౌడ్ ఆత్మబలిదానం మా హృదయాలను తీవ్రంగా కలిచివేసిందని మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. సంస్థను కాపాడేందుకు, కార్మికుల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన శంకర్ గౌడ్‌కు ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఓ పోస్ట్ పంచుకున్నారు. "హక్కుల సాధన కోసం సంఘటితంగా పోరాడాలి తప్ప, ఇలాంటి ఆత్మబలిదానాలకు ఎవరూ ఒడిగట్టవద్దని హృదయపూర్వకంగా మనవి చేస్తున్నాం. శంకర్‌గౌడ్ మృతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే బాధ్యత. ఈ ప్రభుత్వ అలసత్వం, నిర్లక్ష్యం వల్ల ఇలాంటి పరిస్థితి వచ్చింది. అధికారంలోకి రాగానే ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తి చేస్తామని, ..మిగతా 2లో

## శంకర్ గౌడ్ ది ఆత్మహత్య కాదు..
# రేవంత్ సర్కార్ చేసిన హత్య

- ఈ ఉదయం మృతి చెందిన శంకర్ గౌడ్
- పార్థివదేహాన్ని నర్సంపేట డిపో వద్దకు అనుమతించకపోవడం దుర్మార్గమన్న కేటీఆర్
- అరెస్ట్ చేసిన వారందరినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

నర్సంపేట ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగిన 'హత్య' అని ఆయన అన్నారు. శంకర్ గౌడ్ పార్థివదేహాన్ని నర్సంపేట డిపో వద్దకు తీసుకెళ్లి నివాళులు అర్పించేందుకు కూడా అనుమతించకపోవడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. అరెస్టు చేసిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సహా కార్మిక నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కుటుంబ పెద్దను కోల్పోయిన శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. రాష్ట్రంలో ఒకేరోజు ముగ్గురు ఆర్టీసీ డ్రైవర్లు ఆత్మహత్యాయత్నం చేయడం తెలంగాణ చరిత్రలో ఒక 'చీకటి రోజు' అని, ..మిగతా 2లో


www.prajaswaramdaily.com WWW.PRAJASWARAMDAILY.COM



# ప్రభుత్వంతో ఆర్టీసీ చర్చలు సఫలం

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వం అంగీకరించింది. ఇతర రాష్ట్రాల్లో అనుసరించిన విలీన నమూనాలను ఇప్పటికే అధికారులు అధ్యయనం చేశారని, ఆ నివేదికల ఆధారంగా ముందుకు వెళతామని మంత్రులు హామీ ఇచ్చారు. అలాగే కార్మిక సంఘాల (ట్రేడ్ యూనియన్) ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం తన వైపు నుంచి అంగీకారం తెలిపింది. యాజమాన్యంతో చర్చించి త్వరలోనే ఎన్నికల షెడ్యూలు ఖరారు చేసుకోవాలని సూచించింది. ఆర్టీసీ కార్మికులకు అత్యంత కీలకమైన 2021 మరియు 2025 వేతన సవరణ (పీఆర్సీ) బకాయిలు, ఫిట్‌మెంట్‌ను చెల్లించేందుకు ప్రభుత్వం ఆర్థికపరమైన హామీ ఇచ్చింది. ప్రభుత్వ నిర్ణయాలతో సంతృప్తి చెందిన జేఏసీ ప్రతినిధులు సమ్మె విరమణపై అధికారిక ప్రకటన చేసేందుకు సిద్ధమయ్యారు.

చర్చల సందర్భంగా కార్మికుల ఉద్యోగ భద్రతపై ప్రభుత్వం గట్టి భరోసా ఇచ్చింది. భవిష్యత్తులో ప్రైవేటు బస్సులు, అద్దె బస్సులు లేదా ఎలక్ట్రిక్ వాహనాలు ఎన్ని వచ్చినా ప్రస్తుత ఉద్యోగుల విధులకు ఎటువంటి ఆటంకం కలగదని మంత్రులు స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో 52 రోజుల పాటు సమ్మె చేసినా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కనీసం చర్చలకు పిలవలేదని, కార్మికుల సంక్షేమాన్ని విస్మరించారని జేఏసీ నేతలు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం సమ్మె ప్రారంభమైన రెండో రోజే స్వచ్ఛందంగా చర్చలకు ఆహ్వానించడాన్ని వారు కొనియాడారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంత్రులు, అధికారుల కమిటీ వేగంగా స్పందించి సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేశారని చర్చల్లో ప్రస్తావనకు వచ్చింది. మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీకి తగ్గుతున్న ఆదాయాన్ని ప్రభుత్వం రీఇంబర్స్ చేస్తూ సంస్థను కాపాడుతోందని, కార్మికుల క్షేమంపై ప్రభుత్వానికి స్పష్టమైన చిత్తశుద్ధి ఉందని నేతలు అభిప్రాయపడ్డారు.

గతంలో జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని అనిశ్చితి ఉండేదని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు అందడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రభుత్వం ఇప్పటికే క్లియర్ చేసిందని, ఇప్పుడు పీఆర్సీ బకాయిలను కూడా ఒక షెడ్యూలు ప్రకారం విడుదల చేసేందుకు ఏకాభిప్రాయం కుదిరిందని తెలిసింది. విలీనం ప్రక్రియలో ఉన్న చట్టపరమైన చిక్కులను అధిగమించేందుకు మరిన్ని దఫాలుగా చర్చలు జరపాలని నిర్ణయించారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు ఈ రెండేళ్ల కాలంలోనే పరిష్కారం కావడం విశేషమని కార్మిక నేతలు పేర్కొన్నారు. 2013 నాటి బాండ్లకు సంబంధించిన రూ. 280 కోట్లు, 2017 పీఆర్సీ పాక్షిక బకాయిలు విడుదల కావడం తమకు ఊరటనిచ్చిందని చెప్పారు. గతంలో సర్వీసు నుండి తొలగిపోయిన 270 మందికి తిరిగి ఉద్యోగాలు రావడం, సహకార సొసైటీ బకాయిలు తీరడం వంటివి ప్రభుత్వ సానుకూల ధోరణికి నిదర్శనమని జేఏసీ నేతలు వెల్లడించారు. యూనియన్లు లేకపోవడం వల్లే ప్రభుత్వ అద్భుతమైన కార్యక్రమాలు కార్మికుల్లోకి వెళ్లలేదని, ఎన్నికల నిర్వహణతో ఆ లోటు తీరుతుందని మంత్రులకు వివరించారు.

# ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ మృతి

**మొదటిపేజీ తరువాయి**

బలిదానం చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో బస్టాండ్ ప్రాంగణం హోరెత్తిపోయింది. ఈ ఘటనపై విపక్షాలు తీవ్రంగా స్పందిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

శంకర్‌గౌడ్ మృతి పట్ల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితుడు ఆసుపత్రిలో ఉన్న సమయంలోనే పరామర్శించి ధైర్యం చెప్పిన మంత్రి, ఇప్పుడు కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్మికులు ఎవరూ క్షణికావేశంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని, ప్రాణాలు తీసుకోవడం వల్ల సమస్యలు పరిష్కారం కావని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ జేఏసీతో చర్చలు కొనసాగుతున్నాయని, సానుకూల నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. నర్సంపేట ఆర్డీవో ఉమారాణి ప్రభుత్వం తరపున మృతుడి కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. దీంతో పాటు శంకర్‌గౌడ్ కుమారుడికి ఆర్టీసీలో ఉద్యోగం కల్పిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే దొంతిరెడ్డి మాధవరెడ్డి తన వంతుగా రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. అధికారుల హామీలతో కార్మికులు కొంత శాంతించినా, సమస్యల పరిష్కారం అయ్యే వరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు.

ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించకుండా ప్రైవేటు డ్రైవర్లతో బస్సులను నడిపించడాన్ని నిరసిస్తూ శంకర్‌గౌడ్ ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు కార్మికులు చెబుతున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు తాత్కాలిక ప్రాతిపదికన నియామకాలు చేపట్టారు. రోజువారీ వేతనం కింద డ్రైవర్లకు రూ. 1,500, కండక్టర్లకు రూ. 800 ఇచ్చేలా నోటిఫికేషన్లు జారీ చేశారు.



మరోవైపు జేఏసీ నేతలు ప్రభుత్వం ముందు మూడు ప్రధాన డిమాండ్లను ఉంచారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించడం, 30 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ అమలు చేయడం వంటి అంశాలపై పట్టుబట్టారు. అన్ని అంశాలపై స్పష్టమైన హామీ వచ్చే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని కార్మికులు తేల్చి చెప్పారు. ముత్తోజీపేటలో మృతదేహం తరలింపు సమయంలో పోలీసులు, రాజకీయ నేతల మధ్య జరిగిన వాగ్వాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది.

# శంకర్ గౌడ్‌ది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే

**మొదటిపేజీ తరువాయి**



ఇతర అన్ని సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి మాట తప్పడంవల్లనే ఈ దుస్థితి వచ్చింది. మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలు సైతం అమలు చేయకుండా ఇంకెన్నాళ్లు కాలం గడుపుతావు రేవంత్ రెడ్డి? ఇలా ఎంతమందిని బలి తీసుకుంటావు? ఆర్టీసీ కార్మికుల న్యాయమైన ఆవేదనను పరిగణలోకి తీసుకొని, ప్రభుత్వం తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు ప్రారంభించి, కార్మికుల్లో విశ్వాసం కల్పించాలి. శంకర్ గౌడ్ అమరుడైన రోజును "అప్పాయింటెడ్ డే"గా ప్రకటించి, ఆయన త్యాగానికి తగిన గౌరవం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఆర్టీసీ కార్మిక సోదరులారా, మీరు చేస్తున్న పోరాటానికి మేమంతా అండగా ఉన్నాం. అధైర్యానికి లోనుకాకండి. కలిసికట్టుగా, న్యాయబద్ధంగా పోరాడి మన హక్కులను సాధించుకుందాం. ఎలాంటి తొందరపాటు చర్యలకు పాల్పడవద్దని మరోసారి మనవి చేస్తున్నాం." అని హరీష్‌రావు ట్వీట్‌లో పేర్కొన్నారు.

కాగా.. నర్సంపేట డిపో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి చెందారు. హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అపోలో ఆస్పత్రిలో శంకర్ గౌడ్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తైంది. బంధువులకు శంకర్ గౌడ్ మృతదేహాన్ని అప్పగించారు. స్వస్థలానికి శంకర్ గౌడ్ మృతదేహం తరలిస్తున్నారు. నిన్న ఆర్టీసీ డ్రైవర్ పెట్రోల్ పోసుకొని నిప్పంటిచుకున్న విషయం తెలిసిందే. గత రెండ్రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ఈ సమ్మెలో భాగంగా గురువారం రాష్ట్రంలోని అనేక చోట్ల కార్మికులు నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలోనే వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సమ్మెలో పాల్గొన్న శంకర్‌గౌడ్(55) పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆయనను వెంటనే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే 80 శాతం కాలినగాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. ఈ రోజు అత్యక్రియలు జరగనున్నాయి. ప్రముఖ రాజకీయ నాయకులు హాజరుకానున్నారు.



# కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులకు ఊరట

**మొదటిపేజీ తరువాయి**

కేసులుగా పరిగణిస్తూ హైకోర్టు వీటిని కొట్టివేసింది. ఉద్యమ సమయంలో నమోదైన ఇటువంటి కేసులను ఇకపై కొనసాగించాల్సిన అవసరం లేదని న్యాయమూర్తి తన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు.

మలిదశ ఉద్యమ చరిత్రలో మిలియన్ మార్చ్ ఒక కీలక మైలురాయిగా నిలిచింది. అప్పట్లో ప్రభుత్వం విధించిన కఠిన ఆంక్షలను ధిక్కరించి లక్షలాది మంది ప్రజలు ట్యాంక్‌బండ్ వైపు తరలివచ్చారు. ఆ సమయంలో చోటు చేసుకున్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా ఉద్యమాన్ని నడిపించిన కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు సహా ఇతర ముఖ్య నేతలను బాధ్యులుగా చేస్తూ అప్పటి పాలకులు పోలీసుల ద్వారా కేసులు పెట్టించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును కాలరాస్తూ అక్రమంగా ఈ కేసులు బనాయించారని బీఆర్ఎస్ నేతలు అప్పటి నుంచి వాదిస్తూనే ఉన్నారు. న్యాయస్థానం తాజాగా ఇచ్చిన తీర్పుతో వారి వాదనలకు బలం చేకూరినట్లయింది. ఉద్యమకారులపై ఉన్న పాత కేసులను తొలగించడం వల్ల రాజకీయంగా కూడా ఇది చర్చనీయాంశంగా మారింది. విచారణ దశలో ఉన్న ఈ కేసుల నుంచి విముక్తి లభించడంతో గులాబీ దళం సంబరాలు చేసుకుంటోంది. తెలంగాణ సాధన కోసం సాగించిన నిస్వార్థ పోరాటానికి న్యాయం జరిగిందని బీఆర్ఎస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ఈ తీర్పు తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ఇప్పటికే రాష్ట్రంలో వివిధ ఉద్యమకారులపై ఉన్న పాత కేసులను ప్రభుత్వం దశలవారీగా వెనక్కి తీసుకుంటున్న తరుణంలో, నేరుగా హైకోర్టు జోక్యం చేసుకుని కేసులను కొట్టివేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాజకీయ ఆకాంక్షలతో కూడిన ప్రజా పోరాటాలను నేరపూరిత చర్యలుగా చూడకూడదని కోర్టు వ్యాఖ్యలు చేయడం గమనార్హం. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు వంటి అగ్రశ్రేణి నేతలకు ఈ కేసు నుంచి విముక్తి కలగడం వల్ల చట్టపరమైన చిక్కులు తొలగిపోయాయి. ప్రజాస్వామిక నిరసనల్లో పాల్గొన్నందుకు ఎదుర్కొంటున్న వేధింపులకు ఈ తీర్పుతో స్వస్తి పలికినట్లయింది. సుదీర్ఘ పోరాట ఫలితంగా సిద్ధించిన తెలంగాణ రాష్ట్రంలో, ఉద్యమ కాలం నాటి చేదు జ్ఞాపకాలు ఇలా ఒక్కొక్కటిగా కనుమరుగవుతుండటం పట్ల ఉద్యమకారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో మిగిలిన పాత కేసుల విషయంలో కూడా ఇదే విధమైన సానుకూల ఫలితాలు వస్తాయని నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# వాహనదారుల తప్పిదాలతోనే ప్రమాదాలు

- **రోడ్డు ప్రమాదాలపై డీజీపీ శివధర్ రెడ్డి ఆందోళన**
- **ప్రమాదాల కారణంగా రోజుకు 20 కుటుంబాల్లో విషాదం**
- **ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనే ఘటనలకు ప్రధాన కారణం**
- **హెల్మెట్, సీట్ బెల్ట్ ధరిస్తే ప్రాణాపాయం తప్పే అవకాశం**
- **రహదారులపై సైన్ బోర్డుల కొరతను గుర్తించి పోలీసుల చర్యలు**
- **ఫీడర్ రోడ్ల నుంచి ప్రధాన రహదారులకు వచ్చే చోట అప్రమత్తత**
- **'ఎరైవ్-ఎలైవ్' కార్యక్రమం ద్వారా 16 శాతం తగ్గిన ప్రమాద మరణాలు**
- **ట్రాఫిక్ చలానాలపై డిస్కౌంట్లు, రాయితీలు ఉండవని వెల్లడి**
- **కఠిన నిర్ణయాల ద్వారానే ప్రమాదాలను ఆపగలమని స్పష్టం**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో మెజారిటీ ఘటనలు వాహన చోదకుల స్వీయ తప్పిదాల వల్లే సంభవిస్తున్నాయని డీజీపీ శివధర్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. వాహనదారుల్లో కనీస సామాజిక స్పృహ లేకపోవడం, ట్రాఫిక్ నిబంధనలను బేఖాతరు చేయడం వల్ల విలువైన ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల ధాటికి రోజుకు సగటున 20 కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆవేదన చెందారు. ఒక వ్యక్తి ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం మొత్తం ఆర్థికంగా, సామాజికంగా చితికిపోతుందనే విషయాన్ని ప్రతి డ్రైవర్ గుర్తుంచుకోవాలని సూచించారు. ఇటువంటి అకాల మరణాలను అడ్డుకునేందుకు పోలీస్ శాఖ శక్తివంచన లేకుండా కృషి చేస్తోందని, ఇందులో భాగంగానే ప్రజల్లో అవగాహన పెంచేందుకు 'ఎరైవ్‌ఎలైవ్' అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించినప్పుడే సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మన దేశంలో ప్రమాదాల తీవ్రత ఎక్కువగా ఉండటానికి ప్రధాన కారణం అజాగ్రత్తేనని డీజీపీ విశ్లేషించారు. ఎడమ వైపు నుంచి ఓవర్ టేక్ చేయడం, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం, మద్యం సేవించి స్టీరింగ్ పట్టడం వంటి ఉల్లంఘనలే మరణాలకు దారితీస్తున్నాయని మండిపడ్డారు. హెల్మెట్ ధరించడం లేదా సీట్ బెల్ట్ పెట్టుకోవడం వంటి చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని అధ్యయనాల్లో తేలిందని చెప్పారు. వ్యవస్థాపరమైన లోపాలను కూడా ప్రభుత్వం గమనిస్తోందని, ముఖ్యంగా ఫీడర్ రోడ్లు ప్రధాన రహదారుల్లో కలిసే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, సైన్ బోర్డులు లేకపోవడాన్ని గుర్తించామని వెల్లడించారు. అటువంటి బ్లాక్ స్పాట్స్ దగ్గర తక్షణమే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వాహనదారులు కూడా ప్రధాన రహదారిపైకి వచ్చే ముందు వేగం తగ్గించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించే వారికి జరిమానాల విషయంలో ప్రభుత్వం ఇప్పుడు కఠినంగా వ్యవహరిస్తోందని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో మాదిరిగా చలానాలపై డిస్కౌంట్లు ఇస్తారని లేదా మొత్తానికే రద్దు చేస్తారని భావించి నిబంధనలు ఉల్లంఘించడం సరికాదని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఇకపై చలానాల చెల్లింపులో ఎటువంటి రాయితీలు ఉండబోవని, కఠిన నిర్ణయాలు తీసుకుంటేనే మరణాల సంఖ్య తగ్గుతుందని నమ్ముతున్నామని చెప్పారు. పోలీసులు తీసుకున్న ముందస్తు చర్యల వల్ల 2025 మొదటి మూడు నెలలతో పోలిస్తే, ఈ ఏడాది ఇదే కాలంలో మరణాల సంఖ్య 2,102 నుండి 1,770కి తగ్గినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంటే సుమారు 16 శాతం మరణాలు తగ్గాయని, క్షతగాత్రుల సంఖ్యలో కూడా గణనీయమైన మార్పు వచ్చిందని తెలిపారు. భవిష్యత్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిబంధనలు పాటించని వారిపై మరింత నిఘా పెంచుతామని, వేల కుటుంబాల క్షేమం కోరి ఇలాంటి కఠిన చర్యలు తీసుకోక తప్పదని డీజీపీ వివరించారు.

## శంకర్ గౌడ్ ది ఆత్మహత్య కాదు..
# రేవంత్ సర్కార్ చేసిన హత్య

**మొదటిపేజీ తరువాయి**



అయినా ప్రభుత్వంలో చలనం లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఆర్టీసీ కార్మికులు ఎవరూ అధైర్యపడవద్దని, బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని, ప్రభుత్వ మెడలు వంచి హక్కులు సాధించుకుందామని పిలుపునిచ్చారు.

# గ్రామలే దేశానికి పట్టుకొమ్మలు

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 24(ప్రజాస్వరం) :**

గ్రామ పంచాయతీలే ప్రజాస్వామ్యానికి అసలైన పునాదులని, గ్రామ స్వరాజ్యంతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఉప్లూర్ సర్పంచ్ ఏనుగందుల శైలేందర్ అన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామ ప్రజలందరికీ పంచాయతీ రాజ్ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలని, పంచాయతీ వ్యవస్థ బలంగా ఉన్నప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుందని ఆయన ఆకాంక్షించారు. గ్రామ సమగ్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని శైలేందర్ పిలుపునిచ్చారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రజలందరూ తమ సలహాలు, సూచనలు అందించాలని, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు, సిబ్బందిని సర్పంచ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తక్కురి శేఖర్, పంచాయతీ కార్యదర్శి నవీన్ గౌడ్, వార్డు సభ్యులు అజయ్, అనిల్, సంతోష్, సురేష్, సదుల్లా, అంజిత్, సతీష్, వి.ఓ.ఏలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



# కమలం గూటికి మల్లారెడ్డి కుటుంబం?

**మొదటిపేజీ తరువాయి**



సుమారు లక్ష మందితో నిర్వహించ తలపెట్టిన 'వందేమాతరం' ఆలాపన కార్యక్రమానికి సంబంధించి చర్చించేందుకే ఆమె వచ్చారని ప్రాథమిక సమాచారం అందుతోంది. అయితే, మరోవైపు రాజకీయాల్లో ఇలాంటి భేటీలు కేవలం సామాజిక కార్యక్రమాలకే పరిమితం కావనే చర్చ జరుగుతోంది.

**మల్లారెడ్డి ఫ్యామిలీ 'రూట్' మారుతోందా?**

ఇటీవలే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల సందర్భంగా మల్లారెడ్డి తన కోడలు ప్రీతిరెడ్డితో కలిసి ప్రధాని నరేంద్ర మోడీని మర్యాదపూర్వకంగా కలిశారు. రెండు రోజుల క్రితం కూడా స్టేట్ బీజేపీ చీఫ్ ఎన్.రామచందర్‌రావుతో ఆమె భేటీ అయ్యారు. అప్పటి నుంచే మల్లారెడ్డి కుటుంబం బీజేపీలో చేరుతుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ ఊహాగానాలపై మల్లారెడ్డి ఇప్పటివరకు నేరుగా స్పందించనప్పటికీ, ఇప్పుడు ప్రీతిరెడ్డి స్వయంగా బీజేపీ ఆఫీస్‌కు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. భేటీ అనంతరం ప్రీతిరెడ్డి మీడియా ప్రతినిధులతో మాట్లాడితే.. ఇది కేవలం కాలేజీ కార్యక్రమం కోసమేనా లేక రాజకీయ రంగప్రవేశం కోసమా అన్నదానిపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**కోడలి రాజకీయ అరంగేట్రానికి స్కెచ్..**

మల్లారెడ్డి కుమారుడు భద్రారెడ్డి భార్య అయిన ప్రీతిరెడ్డి గత కొంతకాలంగా మేడ్చల్ నియోజకవర్గ పరిధిలో చురుగ్గా తిరుగుతూ ప్రజలతో మమేకం అవుతున్నారు. వృత్తిరీత్యా వైద్యురాలైన ఆమె విద్యా సంస్థల నిర్వహణలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. మల్లారెడ్డి వయసు రీత్యా రాజకీయాలకు దూరమవ్వాలని భావిస్తుండటంతో తన వారసురాలిగా కోడలిని రాజకీయ అరంగేట్రానికి స్కెచ్ వేస్తున్నారు. ఇప్పటికే ప్రీతిరెడ్డి నియోజకవర్గంలోని పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలకు చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నారు. ఆమె తన మాటతీరుతో ప్రజలను ఆకట్టుకుంటూ రాజకీయ నాయకురాలికి ఉండాల్సిన లక్షణాలను ప్రదర్శిస్తున్నారు.



## ఓయూ పీజీ కళాశాల ప్రిన్సిపల్ ఆర్. చత్రపతియాదవ్ ను సన్మానించిన పల్లెటూరు ప్రసాద్

**సిద్దిపేట (ప్రజాస్వరం):**

ఉస్మానియా విశ్వవిద్యాలయం పీజీ కళాశాల సిద్దిపేట ప్రిన్సిపాల్ గా ఆర్ చత్రపతి యాదవ్ నియమితులైన సందర్భంగా పూర్వ విద్యార్థులు పల్లెటూరి ప్రసాద్, బాయికాడి లక్ష్మణ్, తదితరులు శుక్రవారం సన్మానించారు. 2012 సంవత్సరంలో సిద్దిపేటలో పిజి కళాశాల ఏర్పాట్లు చత్రపతి యాదవ్ కృషి మరువలేనిదని దానికి గుర్తింపుగా నేడు ప్రిన్సిపల్ గా పదవి దక్కడం గర్వకారణం అన్నారు. పీజీ కళాశాలలో జర్నలిజం డిపార్ట్మెంట్ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేసిన చత్రపతి యాదవ్ కు ప్రిన్సిపల్ గా పదోన్నతి దక్కడం సంతోషమన్నారు. శుక్రవారం ఫిజి కళాశాల ఆవరణలో వారిని కాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ రమేష్ పాల్వాయి, అసిస్టెంట్ ప్రొఫెసర్ మచ్చ శ్రీహరి, గణేష్ బాబు శ్రీనివాస్ మురళి తదితరులున్నారు.

## వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుక రాష్ట్ర పండుగ

- ఆర్యవైశ్యులకి దక్కిన గౌరవం
- అందరివాడు రేవంత్ రెడ్డి
- ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కౌడ శ్రీనివాస్ గుప్తా

**కౌడిపల్లి ప్రజాస్వరం :-**




శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి వేడుకలను తెలంగాణ రాష్ట్ర సర్కారు అధికారికంగా చేయాలని ప్రకటించడం ఆర్యవైశ్యులకు దక్కిన గౌరవమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని వర్గాల వాడని మెదక్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు కౌడ శ్రీనివాస్ గుప్తా అన్నారు . ఆర్యవైశ్యుల కుల దేవత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంపై కౌడిపల్లి ఆర్యవైశ్య సంఘం హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా కౌడిపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కౌడ శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంపై ఆర్యవైశ్య సంఘం హర్షం వ్యక్తం చేస్తుందన్నారు. ఇది యావత్ ఆర్యవైశ్యులకు ఆత్మగౌరవం పెంపొందిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని వర్గాలకు ప్రాధాన్య తరిస్తున్నాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం సభ్యులు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయం

- తెలంగాణ వైద్య విధాన పరిషత్, సెకండరీ హెల్త్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్

**ప్రజాస్వరం గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిను తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ సెకండరీ హెల్త్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ ఆకస్మికంగా గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. హాస్పిటల్ ప్రాంగణము, ఓపి విభాగము, ఇన్ పేషెంట్ వార్డులు, ప్రసూతి విభాగము, అత్యవసర విభాగము, ల్యాబ్, ఫార్మసీ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ అజయ్ కుమార్ మాట్లాడుతూ హాస్పిటల్లో పరిశుభ్రత, పరిశుధ్యం బయో మెడికల్ వేస్టేజ్, నిర్వహణను మరింత ప్రతిష్టంగా అమలు చేయాలని సూచించారు. రోగులు హాస్పిటల్ కి వచ్చినప్పటి నుంచి చికిత్స పొందే వరకు ప్రతి దశలో సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని, సిబ్బందిని ఆదేశించారు. హాస్పిటల్ ప్రాంగణంలో చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని, వ్యర్ధ పదార్థాలను రంగులు బిన్ లలో వేరువేరుగా విభజించి నిబంధన ప్రకారం సురక్షితంగా తరలించాలని సూచించారు. హాస్పిటల్లో రోగులకు అందిస్తున్న సేవల నాణ్యత, మందుల లభ్యత, వైద్య పరికరాల వినియోగము, శుద్ధి చేసిన త్రాగునీరు, పరిశుధ్యం సిబ్బంది పనితీరు సంతృప్తికరంగా ఉందని అభినందించారు. హాస్పిటల్ ఒక కార్పొరేట్ స్థాయిలో ఉందని ప్రజలందరూ దీనినీ వినియోగించుకోవాలని నాణ్యమైన సేవలు పొందాలని సూచించారు. రోగులు వారి బంధువులు హాస్పిటల్ లో ఇబ్బందులు ఎదుర్కోకుండా సహాయ సిబ్బంది మర్యాదపూర్వకంగా స్పందించాలని ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు . ఆసుపత్రిలో సేవలు మెరుగుదలతో పాటు ప్రజలకు విశ్వాసం పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. వారి వెంట గజ్వేల్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ డాక్టర్ రాజేష్ ఆర్.ఎం.వో. డాక్టర్ ప్రణీతి ఆర్.ఎం.వో సీనియర్ అసిస్టెంట్ సతీష్, నర్సింగ్ సూపరింటెండెంట్ సువర్ణ ,ఫార్మసీ ఆఫీసర్స్ విమల, ఎఫ్సిబా, శ్రీనివాసచారి, మోహన్ బండారి, శానిటరీ ఇన్స్పెక్టర్ లక్ష్మి ,ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్సింగ్ ఆఫీసర్ మెహరాజ్ భాను, రజిత, హెడ్ హెడ్ నర్సిస్ జగదాంబ, ఉమామహేశ్వరి, వకుళా దేవి ,నిర్మల, పుష్ప ,హెల్త్ అసిస్టెంట్ వాసుదేవ్, టెక్నీషియన్ రాజు ఆరోగ్యశ్రీ ఇన్చార్జి సురేందర్, సంతోష్ తదితరులు ఉన్నారు.



## నార్సింగి గ్రామ పంచాయతీ లో పన్నుల వివాదం మరవకముందే మరో వివాదం..

**ప్రజాస్వరం నార్సింగి, ఏప్రిల్ 24**

నార్సింగి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం లో అవినీతి ఆరోపణలు ఆగడం లేదు. ఇటీవల పన్నుల వసూళ్ల విషయంలో ఆన్లైన్ లో ఒక విధంగా, కార్యాలయం లో మరో విధంగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఒకరిని విధుల నుంచి తొలగించిన విషయం మరువకముందే, మళ్లీ కొత్త ఆరోపణలు రావడం స్థానికంగా చర్చనీయాంశమైంది. జాతీయ పంచాయతీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన గ్రామ సభలో ఈ వ్యవహారం వెలుగు లోకి వచ్చింది. పట్టణానికి చెందిన సంతోష్ వ్యాపార లైసెన్స్ రెన్యువల్ కోసం పంచాయతీ కార్యాలయానికి వచ్చాడు. కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ ను సంప్రదించగా, ఇక్కడ దరఖాస్తులు స్వీకరించడం లేదని, బయట మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీనిపై సంతోష్, “మీరు చేయలేరా?” అని ప్రశ్నించగా, అదనంగా రూ.200 ఇస్తే పని చేస్తానని ఆపరేటర్ చెప్పినట్లు ఆరోపించాడు. అదనపు చెల్లింపులపై ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఈఓ నాగభూషణం ఇద్దరినీ సముదాయించారు. అదనంగా డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అయితే, సంతోష్ మద్యం సేవించి వచ్చి గొడవ చేస్తున్నాడని ఆపరేటర్ ఆరోపించ గా, తాను మద్యం సేవించ లేదని సంతోష్ ఖండించాడు. అనంతరం ఈఓ పరిస్థితిని సర్దిచెప్పి వారిని పంపించారు. అయితే, శుక్రవారం గ్రామ సభ జరుగుతుండగా సంతోష్ మళ్లీ ఈ విషయాన్ని ప్రస్తావించడం తో మరోసారి వివాదం చెలరేగింది. సర్పంచ్ ఆకుల సుజాత, ఉప సర్పంచ్ రాజేందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు జోక్యం చేసుకుని పన్నుల వసూళ్లలో ఇప్పటికే వివాదం ఉన్న సమయంలో మళ్లీ అదనపు డబ్బులు అడగడం ఏంటని కంప్యూటర్ ఆపరేటర్ ను ప్రశ్నించారు.

**ఈఓ వివరణ**

లైసెన్స్ రెన్యువల్ విషయంలో రూ.200 అదనంగా తీసుకున్న విషయం నిజమేనని ఈఓ నాగభూషణం తెలిపారు. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.





## శివాయిపల్లి లో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం....

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్...

**మెదక్ (ప్రజాస్వరం) ప్రతినిధి**

మెదక్ మండలం శివాయిపల్లి గ్రామంలో శుక్రవారం పండుగ వాతావరణంలో లబ్ధిదారుల ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో కలెక్టర్. పాల్గొన్నరు.ఇందిరమ్మ గృహాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల సంక్షేమ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు జరుగుతున్నాయని ఈ కార్యక్రమంలో భాగంగా శివాయిపల్లి గ్రామంలో ఇందిరమ్మ గృహ లబ్ధిదారులు తోట్ల లక్ష్మి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పక్కాగా పారదర్శకంగాజరుగుతుందన్నారు. సొంత స్థలం ఉండి ఇల్లు లేని వారికి మొదటి ప్రాధాన్యతగా గుర్తించి వారికి ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మల నిర్మాణం కోసం ప్రభుత్వం విడుదలవారీగా నిధులు విడుదల చేస్తున్నారు. ఒక్కో గృహ నిర్మాణానికి ఐదు లక్షలు అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 750 ఇందిరమ్మ ఇండ్లు పూర్తయ్యాయని, మిగిలిన వారు కూడా త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 650 ఇండ్లు గృహప్రవేశాలు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, హౌసింగ్ పీడీ మాణిక్యం, సర్పంచ్ వినీత భాస్కర్, ఉప సర్పంచ్ మల్లేశం, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు,అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు...



## నిరుపేద ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు

- ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పించింది.
- రొయ్యూరు గ్రామ పంచాయతీ సర్పంచు కావిరి అర్జున్

**ఏటూరునాగారం,ఏప్రిల్24(ప్రజాస్వరం ):**



గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఏటూరునాగారం మండలం రొయ్యూరు గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సర్పంచ్ కావిరి అర్జున్ మాట్లాడుతూ మంత్రి సీతక్క ఆదేశాలు వారి పూర్తి సాకారంతో న్యూ వన్ అపోలో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ (ఏటూరునాగారం)మరియు అజార హాస్పిటల్ (వరంగల్) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరం గ్రామ ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పించిందినీ గ్రామ పంచాయతీ సర్పంచ్ కావిరి అర్జున్ అన్నారు ఈ శిబిరానికి పెద్ద సంఖ్యలో గ్రామస్తులు హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. రోగులకు సాధారణ వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది. ముఖ్యంగా పరీక్షలను ఉచితంగా నిర్వహించడం విశేషం. అదనంగా థైరాయిడ్, కొలస్ట్రాల్ వంటి ముఖ్యమైన రక్తపరీక్షలు కూడా ఉచితంగా నిర్వహించి ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచారు. ఈ సందర్భంగా డాక్టర్ వివేక్ నరసింహ,డాక్టర్ నీరజ పొన్నాల,డాక్టర్ శ్రీరాం మహేష్ పాల్గొని రోగులను పరిశీలించి తగిన వైద్య సూచనలు అందించారు వారి సేవలు గ్రామ ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా నిలిచాయి. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కావిరి అర్జున్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. హాస్పిటల్ మేనేజ్మెంట్ తరపున పున్నం రాజకుమార్,కుల్లా అనిల్ కుమార్ సమన్వయం చేపట్టారు. గ్రామ ప్రజలు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు మరింతగా నిర్వహించాలని నిర్వాహకులను కోరారు.గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో ఈ మెగా వైద్య శిబిరం ఆదర్శంగా నిలిచింది. నిరుపేద ప్రజలకు ఉచితంగా మెరుగైన చికిత్స అందించిన వైద్యులు ,సిబ్బంది, నిర్వాహకులు మరియు సహకరించిన గ్రామ ప్రజాప్రతినిధులకు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

## ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతికి నైతిక బాధ్యత వహిస్తూ రవాణా శాఖ మంత్రి

# పొన్నం ప్రభాకర్ గౌడ్ వెంటనే రాజీనామా చేయాలి.

- **ఆర్టీసీ కార్మికుల హక్కులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాలరాస్తుందని హెచ్చరిక**
- **గజ్వేల్ పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఆర్టీసీ కార్మికులతో, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి వినతి పత్రం అందజేత**




**ప్రజాస్వరంగజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతికి కారణమైన కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి మొండివైఖరికి నిరసనగా గజ్వేల్ పట్టణంలో ఆర్టీసీ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ కార్మికులు నిర్వహించిన ర్యాలీలో పాల్గొని సంఘీభావం తెలిపి ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కారం చేయాలని నిరసన తెలుపుతూ గజ్వేల్ పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఆర్టీసీ కార్మికులతో, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీలు కార్మికుల హక్కులను రేవంత్ రెడ్డి కాలరాస్తున్నారని, ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం లేదని,ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని జరుగుతున్న సమ్మెలో ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కారం కాకపోవడం పై ఆవేదనతో నర్సంపేట బస్ డిపో వద్దం ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ తన ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. 80 శాతం పైగా గాయాలతో వరంగల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడవడం చాలా బాధాకరమని అన్నారు, ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వ హత్య అని తెలిపారు, ఆత్మహత్య చేసుకున్న శంకర్ గౌడ్ కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్గ్రేషియా ప్రకటించాలని, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల జీవితాలతో చెలగాటమాడకుండా మేనిఫెస్టోలో వారికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్న కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని కనీసం వారిని చర్చలకు కూడా పిలువకపోవడం చాలా బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రేవంత్ రెడ్డికి కమిషన్ల మీద, అవినీతి అక్రమల మీద, భూకబ్జాల మీద ఉన్న సోయి కార్మికుల సమస్యల పరిష్కారంలో లేదని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ఉందో లేదో అని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా మొద్దు నిద్రను వీడి ఇచ్చిన హామీలను గ్యారెంటీలను మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ప్రతి ఒక్కటిని నెరవేర్చాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పొద్దుతిరుగుడు పంటను, మొక్కజొన్న పంటలను వెంటనే కొనుగోలు చేయాలి

- **గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి**

**ప్రజాస్వరం గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ యార్డును బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు కలిసి రైతులు మార్కెట్ యార్డుకు తీసుకువచ్చిన ప్రొద్దుతిరుగుడు మొక్కజొన్న పంటలను పరిశీలించారు. పంటలను పరిశీలిస్తున్నప్పుడు రైతులు తమ పంటలు తీసుకువచ్చి నెల రోజులు గడుస్తున్న నిద్రాహారాలు మానుకొని ఉన్న అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసిన పంటలను కొనుగోలు చేయడం లేదని వంటేరు ప్రతాప్ రెడ్డి ముందు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

వెంటనే పొద్దుతిరుగుడు, మొక్కజొన్న పంటలను కొనుగోలు చేయాలని వంటేరు ప్రతాపరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అవగాహన లేకపోవడం వలన రైతుల పట్ల చిత్తశుద్ధి లేకపోవడం వలన, సన్ ఫ్లవర్ మొక్కజొన్న కేంద్రాలను చేయకపోవడం వలన నెల రోజుల నుంచి రైతులు ఎర్రటి ఎండలో ఇబ్బంది పడుతున్న, మార్కెట్ యార్డులలో పంటలు తీసుకువచ్చి, ఫస్ట్ నుండి తమ పంటలను కొనుగోలు చేయాలని ప్రదక్షిణలు చేసిన అధికారులకు కానీ రేవంత్ రెడ్డి గాని చీమకుట్టినట్లు కూడా లేదని, ప్రభుత్వం నిమ్మకు నీరు తినట్లుగా వ్యవహరించడం చాలా దారుణమని మండిపడ్డారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుకి ఏ పంటను ఏ సమయంలో కొనుగోలు చేయాలో అవగాహన లేదా అని ఎద్దేవా చేశారు. మార్కెట్ యార్డులలో మరియు రైతుల పొలాల్లో సన్ ఫ్లవర్ పంటలు మొక్కజొన్న పంటలు ఎక్కడ చూసినా నిల్వగా ఉన్నాయని ఎక్కడ అమ్మకోవాలో తెలియక రైతులు దళారులకు తక్కువ ధరలకు అమ్ముతున్నారని, దళారులతో కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి కుమ్మక్కయ్యారని, రైతుల నడ్డి విరుస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు.

గజ్వేల్ నియోజకవర్గం లో కొండపోచమ్మ సాగర్ మల్లన్న సాగర్ లాంటి ప్రాజెక్టులు ఉండడం వలన కాలువలలో చెరువులలో పుష్కలంగా నీరు ఉండడంతో రైతులు పంటలు పండించుకుంటున్నారని తెలిపారు.దళారులకు రైతుల అమ్మకోవడం వలన ఒక క్వింటాలకి 1000 నుండి 2000 వరకు రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పంటలను కొనుగోలు చేయాలని మేల్కొల్పితే గాని, రోడ్లమీదకి వచ్చి ధర్నాలు నిరసనలు చేస్తే గాని, కాంగ్రెస్ ప్రభుత్వానికి రేవంత్ రెడ్డికి కనువిప్పు కలగడం లేదన్నారు. ఈ రెండున్నర సంవత్సరాల రేవంత్ రెడ్డి పరిపాలనలో ఎక్కడ చూసిన దరిద్రం దాపరించిందని రైతుల పరిస్థితి అగేమ్యగోచరంగా మారిందని అన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరిచి రైతులకు ఇబ్బందులు పెట్టకుండా ఆంక్షలు లేకుండా మద్దతు ధరలను కల్పిస్తూ సన్ ఫ్లవర్, మరియు మొక్కజొన్న పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వేలాది మందితో రైతులతో కలిసి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ముందు, అనంతరం రాజీవ్ రహదారిపై ధర్నా చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రేవంత్ రెడ్డిని హెచ్చరించారు.గతంలోని కేసీఆర్ ప్రభుత్వం దూర దృష్టితో రైతాంగానికి కాలంలో పెట్టుబడి సహాయం అందిస్తూ, రైతులకు నాణ్యమైన ఉచితమైన కరెంటునిస్తూ, మండుటెండల్లో సైతం గోదావరి జలాలను రైతుల పొలాల్లోకి పారిస్తూ, రైతులు తీసుకువచ్చిన పంటలను రైతుల సమయం వృధా చేయకుండా గిట్టుబాటు ధరలను కల్పిస్తూ పంటలను కొనుగోలు చేయడం, రైతులకు సకల సౌకర్యాలు కల్పించి రైతును ఆర్థికంగా బలోపేతం చేసిన ఘనత కేసిఆర్ ది అన్నారు గత కేసిఆర్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్రం భారతదేశ వానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా మారిందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి మరియు సంక్షేమంలో నంబర్ వన్ గా ఉందని దేశంలోనే ధనిక రాష్ట్రంగా మార్చిన ఘనత కేసిఆర్ ది అన్నారు.





ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్ పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్పర్సన్ పద్మాబాయి నర్సింగారావు, గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాస శ్రీనివాస్, గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, గజ్వేల్ మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, మాజీ జెడ్పిటిసి బొల్లారం ఎల్లయ్య, పంగ మల్లేశం, అర్జున్ గౌడ్ రాణి సత్యనారాయణ గౌడ్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణా రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ జక్యూద్దీన్ ,కౌన్సిలర్ బొగ్గుల స్వప్న సురేష్, గోలి మమతా సంతోష్, మామిడి శ్రీధర్, కాముని మురళి, కోట బాబు, కనక సేన, కప్పు మమత సంతోష్, సీనియర్ నాయకులు ఆకుల దేవేందర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, పొట్టోళ్ళ శ్రీనివాస్,అబ్దుల్, ఉమర్, స్వామి చారి, బలమణి శ్రీనివాస్ రెడ్డి, కరీం, పుల్ల బీరయ్య, బాలచంద్రం, రవీందర్ రెడ్డి బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులు ఉన్నారు.



## మాజీ సర్పంచ్ సుమన్ గౌడ్ పార్ధవ దేహానికి నివాళర్పించిన వంటేరు ప్రతాప్ రెడ్డి

**ప్రజాస్వరం గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

జగదేవపూర్ మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మర్రికింది సుమన్ గౌడ్ గుండె పోటుతో అకాల మరణం చెందాడు. విషయం తెలుసుకున్న బి అర్ ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జి వంటేరు ప్రతాపరెడ్డి మాజీ సర్పంచ్ మర్రికింది సుమన్ గౌడ్ పార్ధవ దేహానికి పూల మాల వేసి నివాళర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట గజ్వేల్ మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ మాజీ ఎంపీటీసీల రాష్ట్ర అధ్యక్షులు దేవి రవీందర్ మాజీ గజ్వేల్ మాజీ వైస్ చైర్మన్ రాచమల్ల ఉపేందర్ రెడ్డి మండల మాజీ పిఎసిఎస్ చైర్మన్ ఇంద్రసేనా రెడ్డి గ్రామ సర్పంచ్ రాజు, సుధాకర్ రెడ్డి, భూమయ్య కిరణ్,మహేందర్ శ్రీశైలం, లక్ష్మణ్ మల్లేశం తదితరులు ఉన్నారు.

## వాసవిమాత జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం హర్షణీయం

**ప్రజాస్వరం సిద్దిపేట ప్రతినిధి :**

వాసవిమాత జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం హర్షనీయమని సిద్దిపేట పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు నేతి కైలాసం అన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 26వ తేదీన వాసవి మాత జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నమన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రం లోని హౌసింగ్ బోర్డు లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుపుతామాన్నారు. వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద అన్నప్రసాద విచారణ కార్యక్రమం చేపడతామని, ఈ కార్యక్రమంలో వైశ్యలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో సిద్దిపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు మధుసూదన్, సురేష్, పప్పు రవి, నాగరాజు పలువురు పాల్గొన్నారు.




## నిజాయితిగా పని చేస్తే విజయం సాధించవచ్చు ...

- **బాధితుల పక్షాన అడ్వకేట్స్ నిలబడాలి**
- **అడ్వకేట్స్ గా రాణించాలంటే లాంగ్వేజెస్ నేర్చుకోవాలి**
- **సిద్దిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ బాబు, లీగల్ సెల్ అత్తారిటీ డిప్యూటీ చీఫ్ శరత్ బాబు**

**సిద్దిపేట ప్రజాస్వరం :**

నిజాయితీగా పని చేస్తే విజయం దానంతట అదే వరిస్తుందని సిద్దిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ బాబు, లీగల్ సెల్ అత్తారిటీ డిప్యూటీ చీఫ్ శరత్ బాబు అన్నారు. మూట్ కోర్టు ప్రాజెక్టు లో బాగంగ వినాయక లా కాళశాల విద్యార్థులు శుక్రవారం సిద్దిపేట లోని కోర్టు లను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో బార్ అసోసియేశన్ ప్రెసిడెంట్ రమేష్ బాబు మాట్లాడుతూ అడ్వకేట్స్ నిజాయితీగా పని చేయాలన్నారు. ఎక్కువ లాంగ్వేజ్లు నిర్చుకోవడం వల్ల, సబ్జెక్టు పై పట్టు సాధిస్తే కేసులను చాలా సులభంగా గెలవచ్చని సూచించారు. డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అత్తారిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చైల్డ్ మ్యారేజ్, ప్రొటెక్షన్ అవగాహన సదస్సులో లా విద్యార్థులు పాల్గొన్నారు. DSL డిప్యూటీ చీఫ్ శరత్ బాబు విద్యార్థులకు చైల్డ్ ప్రొటెక్టన్, చైల్డ్ మ్యారేజ్ పై ఉన్న చట్టలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేశన్ కార్యదర్శి సదానందం,లా కళాశాల చైర్మన్ రాజు, వైస్ ప్రిన్సిపల్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

- **మంద కృష్ణ మాదిగ**

**సికింద్రాబాద్, ఏప్రిల్ 24 (ప్రజాస్వరం):**

మతం మారిన దళితులకు ఎస్సీ హోదా కల్పించడమే లక్ష్యంగా 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని వైఎంసీఏలో ఆల్ ఇండియా క్రిష్టియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన దళిత క్రైస్తవుల హక్కుల ఐక్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దళితులు బౌద్ధ లేదా సిక్కు మతాల్లోకి మారినప్పుడు వారి రిజర్వేషన్లు ఎలాగైతే కొనసాగుతున్నాయో, క్రైస్తవంలోకి మారిన వారికి కూడా అదే విధంగా ఎస్సీ హోదాను వర్తింపజేయాలని ఆయన స్పష్టం చేశారు. దళిత క్రైస్తవుల ప్రస్తుత దుస్థితికి కాంగ్రెస్ పార్టీయే ప్రధాన కారణమని మంద కృష్ణ తీవ్రంగా విమర్శించారు. 1950లో ఆ పార్టీ తీసుకువచ్చిన రాష్ట్రపతి ఉత్తర్వులే దళిత క్రైస్తవుల మెడకు కత్తిలా మారాయని ఆయన ధ్వజమెత్తారు. దశాబ్దాల కాలం పాటు దేశాన్ని ఏకఛత్రాధిపత్యంగా పాలించిన కాంగ్రెస్, రంగనాథ్ మిశ్రా కమిటీ సానుకూల నివేదిక ఇచ్చినప్పటికీ ఈ వర్గానికి న్యాయం చేయడంలో విఫలమైందని ఆరోపించారు. మిత్రులు ఎవరో, శత్రువులు ఎవరో గుర్తించకుండా దళిత క్రైస్తవులు గుడ్డిగా కాంగ్రెస్‌కు ఓటు వేయడం రాజకీయ చైతన్యం అనిపించుకోదని, ఊహల ఆధారంగా తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని ఆయన సూచించారు. వర్గీకరణ విషయంలో ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రాజకీయ పార్టీల మౌనం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణను జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కమిషన్ నివేదిక తర్వాత ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు. ఈ లోగా దళిత క్రైస్తవులు ఎదుర్కొంటున్న కుల వివక్షపై పక్కా ఆధారాలతో కమిషన్‌కు నివేదికలు అందజేయాలని పిలుపునిచ్చారు. దక్షిణ భారతదేశంతో పాటు ఈశాన్య రాష్ట్రాల క్రైస్తవులను కూడా ఏకం చేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తానని ఆయన ప్రకటించారు. కేవలం మత విశ్వాసాలకే పరిమితం కాకుండా రాజకీయంగా చైతన్యవంతులైనప్పుడే సామాజిక స్థితిగతుల్లో మార్పు వస్తుందని, దళిత క్రైస్తవులకు అండగా నిలవడమే ఎమ్మార్పీఎస్ నైజమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏఐసీఎఫ్ అధ్యక్షులు గద్దపాటి విజయరాజు, పాస్టర్లు సంతూ జూలియస్, అద్దంకి రంజిత్ ఓఫిర్, కళ్యాణి, జెకబ్ శామ్యూల్ పాల్గొన్నారు.



## అల్లైడ్ సైన్సెస్ విద్యార్థులు వైద్య రంగానికి వెన్నుముక లాంటివారు

- **గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే ఇందిరా**
- **ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు**

**సికింద్రాబాద్,ఏప్రిల్ 24 ( ప్రజాస్వరం ):**

అలైడ్ సైన్సెస్ విద్యార్థులు వైద్య రంగానికి వెన్నెముక వంటివారని సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే ఇందిరా అన్నారు. గాంధీ మెడికల్ కళాశాలలో బీఎస్సీ అలైడ్ సైన్సెస్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో 2024 బ్యాచ్ సీనియర్ విద్యార్థులు, 2025 బ్యాచ్ జూనియర్లకు ఘనంగా స్వాగతం పలికారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గాంధీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిర మాట్లాడుతూ... విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. వైద్యులకు మరియు రోగులకు మధ్య వీరు ఒక బలమైన వారధిగా నిలవాలని ఆమె ఆకాంక్షించారు. మూడు సంవత్సరాల కోర్సులో భాగంగా వివిధ విభాగాల్లో చేరిన విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని, భవిష్యత్తులో ఉత్తమ సేవలందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తరగతులకు క్రమం తప్పకుండా హాజరవుతూ ప్రొఫెసర్లు బోధించే అంశాలను శ్రద్ధగా వినాలని, ముఖ్యంగా ఆసుపత్రిలో నిర్వహించే క్లినికల్ పోస్టింగ్‌స్‌కు హాజరై ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించుకోవాలని సూచించారు.ఈ వేడుకల్లో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రాజారావు, అనాటమీ హెచ్ఓడీ డాక్టర్ సుధారాణి, ప్రొఫెసర్ డాక్టర్ సుధాకర్ బాబు, అనస్తీసియా ప్రొఫెసర్ డాక్టర్ మురళీధర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సంగీత, ఎంపీహెచ్ఓ వేణుగోపాల్ గౌడ్ సహా పలువురు అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502036. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502036,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2007/18184, CELL : 8008609999